క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలోని ఇందిరానగర్, సాయినగర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని 'సెస్' అధికారులు గురువారం తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సెస్ అధికారులు కోరారు.

అశ్వవాహనంపై ఊరేగింపు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు అశ్వవాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో హోమం, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: కార్మిక దినోత్సవ పోస్టర్లను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆవిష్కరించారు. సుభాష్‌నగర్‌లోని కార్మిక భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మే1న జరిగే కార్యక్రమానికి జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు హాజరుకావాలని కోరారు. పంతం రవి, నాగరాజు, చంద్రమౌళి తదితరలు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రాజేశ్

తంగళ్లపల్లి: విద్యార్థులకు గణితంపై భయం వీడాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మ్యాథమెటిక్స్ (అగ్రహారం) రాజేశ్ అన్నారు. బుధవారం మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 8,9 తరగతి విద్యార్థులకు గణితంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మల్కపేటలో మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు సొంత నిధులతో ప్రాజెక్ట్ కట్టపై బొల్లిగుట్టపై ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. గురువారం ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. విష్ణు సహస్రనామస్తోత్ర పారాయణం, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 21న జరిగే విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు చినజీయర్ స్వామి తదితరులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఇప్పటికే సాగు, తాగునీరు, విద్యుత్‌పై బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తితే సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు గౌస్, లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బాబు, దేవయ్య, రాజేందర్, మల్లేశం, రాజునాయక్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: పేదింటి యువతి వివాహానికి బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతి రెడ్డి అండగా నిలిచారు. ఇల్లంతకుంట మండలం వల్లంపట్లకు చెందిన కర్ల పద్మ–లచ్చయ్య దంపతుల కూతురు అనూష వివాహానికి రూ.10 వేలు విలువగల వస్తువులు, టేకు మంచాలను గురువారం అందజేశారు. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు తనవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఫౌండేషన్ ప్రతినిధులు బోయిని రంజిత్, కట్ట సుధాకర్ రెడ్డి, కర్ల లక్ష్మణ్, గూడెల్లి ఆంజనేయులు, రాజయ్య, రమేశ్, లక్ష్మణ్, తిరుపతి, శేఖర్, వంశీ, అజయ్, తిరుపతి, చెర్రీ తదితరులున్నారు.

సురక్షిత తాగునీరే లక్ష్యం

- పంచాయతీలకు 'క్లోరోస్కోప్' కిట్లు పంపిణీ
- ఇప్పటికే కార్యదర్శులకు అవగాహన
- గ్రామాల్లో రోజూ నీటి నాణ్యత పరీక్షలు చేపడుతున్న అధికారులు



మల్లారెడ్డిపేటలో నీటి నాణ్యత పరీక్ష చేస్తున్న అధికారులు

గంభీరావుపేట: గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నీటి కాలుష్యాన్ని అరికట్టి నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు కిట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. మూడేళ్ల తర్వాత గ్రామాల్లో నీటి పరీక్షలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం 'క్లోరోస్కోప్' వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్ట్ కిట్లను మిషన్ భగీరథ విభాగం ద్వారా గ్రామ పంచాయతీలకు అందించింది. గతంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పంచాయతీలకు నాణ్యత పరీక్ష కిట్లు అందించినా వాటి జాడలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మళ్లీ కిట్లు పంపిణీ చేసింది.

కలుషితమవుతున్న తాగునీరు

పల్లెల్లో పైపులైన్ లీకేజీలు, బోరుబావులు, చేతిపంపుల చుట్టూ అపరిశుభ్రత నెలకొని తాగునీరు అధికంగా కలుషితమవుతోంది. ప్రజలు కలుషిత తాగునీరు తాగి అనారోగ్యంబారిన పడకుండా నీటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు కిట్లు అందించి పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. నీటిలో పీహెచ్, ఫ్లోరైడ్, నైట్రేట్, క్లోరైడ్, ఐరన్ శాతాలను, క్లోరినేషన్ స్థాయిని కిట్ల ద్వారా పరీక్షించి నీటిని సరఫరా చేయనున్నారు. ఫలితంగా తాగునీరు కలుషితం కాకుండా ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

రోజూ నీటి నాణ్యత పరీక్షలు

నీటిని పరీక్షించేందుకు రియోజెంట్ రసాయనం, రెండు గాజు నాళికలు, ఒక బ్రష్ ఉన్నాయి. వీటిద్వారా నీటిలో క్లోరిన్ ఎంత మోతాదులో ఉందో తెలుసుకునేందుకు వీలుంది. ఒక గాజు నాళికలో 5 ఎంఎల్ తీసుకొని అందులో నాలుగు చుక్కల రియోజెంట్ రసాయనం కలిపితే క్లోరిన్ ఎంతశాతం ఉందో తెలుస్తోంది. క్లోరోస్కోప్ కిట్ల ద్వారా సురక్షితమైన నీటినే ప్రజలకు అందించనున్నారు. ప్రతిరోజూ అధికారులు నీటి నాణ్యత పరీక్షలు చేయనున్నారు. నీరు విడుదలయ్యే ట్యాంకులు, నల్లాల వద్ద, ట్యాంకుల వద్ద నీటి నాణ్యత పరీక్షలు చేయనున్నారు. దానికనుగుణంగా బ్లీచింగ్ పౌడర్ కలుపనున్నారు.

అవగాహన కల్పించాం



ప్రతి గ్రామ పంచాయతీకి క్లోరోస్కోప్ కిట్లుం అందించారు. ఈ కిట్ల ద్వారా రోజూ నీటి పరీక్షలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాం. నీటి నాణ్యతను పరిశీలించి దానికనుగుణంగా నీటి సరఫరా చేస్తున్నాం.

– హరిప్రియ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గంభీరావుపేట

ఓటుహక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సాంస్కృతిక కళాకారులు

వేములవాడ : స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు వినియోగంపై సాంస్కృతిక కళాకారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతిఒక్కరూ పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటుహక్కు ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని తమ ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పుదూరి సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, అంతడుపుల లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించండి



కూలీలతో మాట్లాడుతున్న బోయినపల్లి మాధవి

తంగళ్లపల్లి: కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ బోయినపల్లి మాధవి కోరారు. ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి, తాళ్లపల్లి, ఇల్లంతకుంట, అనంతగిరిలో జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వారు మాట్లాడారు. వినోద్ కుమార్ ఎంపీగా ఉండగా కరీంనగర్–మనోహరాబాద్ రైల్వే లైన్ తెచ్చారని, కరీంనగర్‌కు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తీసుకొచ్చారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, మీసరగండ్ల అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిండా.. ప్లాస్టిక్ బాటిళ్లు

సిరిసిల్లటౌన్: చిన్నపాటి వర్షానికే సిరిసిల్ల పాత బస్టాండ్ ఏరియా ప్రాంతంలో డ్రైనేజీ నీరంతా రోడ్డుపై పారుతుంది. గురువారం బల్దియా సిబ్బంది డ్రైనేజీలో సిల్ట్ తీసే పనిలో పడగా వెంకంపేట ఏరియా నుంచి పాతబస్టాండ్ సమీపంలోకి వచ్చే డ్రైనేజీ కాలువలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్, సీసం బాటిల్స్, చెత్తాచెదారం బయటపడింది. గంటల కొద్దీ సమయం వెచ్చించి పారిశుధ్య కార్మికులు డ్రైనేజీని శుభ్రం చేశారు. సిల్ట్‌లో వేలసంఖ్యలో బాటిల్స్ రావడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపల్ అధికారుల పనితీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'మందకృష్ణ మాదిగను విమర్శిస్తే సహించం'

ఎల్లారెడ్డిపేట: మాదిగలను మోసం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను మించిపోయారని, కాంగ్రెస్ జన జాతరలో అవాస్తవాలు మాట్లాడిన ఆయన మాదిగలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగలను రాజకీయంగా అణచివేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మంద కృష్ణమాదిగను విమర్శిస్తే మాదిగల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు సమావేశంలో రాష్ట్ర నాయకులు బొల్లారం చంద్రమౌళి, జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, నాయకులు కుమార్, దేవరాజు, కృష్ణంరాజు, ఆకారం రాజు తదితరులు పాల్గొన్నారు.

మాంసం విక్రయాలపై అనుమతి తీసుకోవాలి

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ పరిధిలో మాంసం విక్రయాలపై అనుమతులు పొందాలని తహసీల్దార్, ప్రత్యేకాధికారి సురేశ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశు వైద్యాధికారి స్టాంపింగ్ పొందిన జీవాలను మాత్రమే వధించాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న జీవాలకు అనుమతులు ఇస్తామన్నారు. మాంసం విక్రయదారులకు నోటీసులు జారీచేయనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిబంధనలు అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రారంభానికి సిద్ధం

- వేములవాడలో రూ.1.45 కోట్లతో నూతన గ్రంథాలయం
- త్వరలోనే ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న పాఠకులు



వేములవాడలో నూతన గ్రంథాలయం

వేములవాడఅర్బన్: వేములవాడలో పట్టణంలో నూతన గ్రంథాలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు గ్రంథాలయం ఎక్కడ ఉందనేది పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో తెలియదు. ఆధునిక హంగులతో గ్రంథాలయాన్ని నిర్మించాలని పలుసార్లు పాఠకులు ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నారు. ఇన్ని రోజులకు అన్ని హంగులతో వేములవాడలో గ్రంథాలయ నిర్మాణ పనులు పూర్తికాగా త్వరలోనే ప్రారంభించనున్నారు.

ఇప్పటివరకు అద్దె ఇంట్లోనే

పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ వీధిలో చిన్న అద్దె ఇంట్లో రెండుగదుల్లో ఏళ్లక్రితం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు అక్కడేగ్రంథాలయం కొనసాగుతోంది. ఆ వీధిలో కనీసం ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసేందుకు కూడా స్థలం లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడేవారు. ఎక్కువ మంది వస్తే గ్రంథాలయంలో కుర్చీలు సరిపోకపోవడం, గదులు ఇరుకుగా ఉండటం వంటి సమస్యలు ఉండేవి. దీంతో పాఠకులు గ్రంథాలయానికి వచ్చేందుకు ఆసక్తి కనబర్చేవారు కాదు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు ఇబ్బందిపడేవారు. పట్టణవాసులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పట్టణంలో గ్రంథాలయం ఉన్నట్లు కూడా చాలామందికి తెలిసేదికాదు.

రెండేళ్లక్రితం పనులు ప్రారంభం

వేములవాడ మండల పరిషత్ కాంప్లెక్స్‌లో సుమారుగా ఏడెకరాల 12 గుంటల స్థలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. రోజూ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ కార్యాలయాలకు మండలంలోని గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అందరికీ అనుకులంగా అందులో విశాలమైన ప్రదేశంలో అన్ని హంగులతో గ్రంథాలయం నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారు. మొదటి దఫాగా ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 లక్షలు, వేములవాడ మున్సిపల్ నుంచి పట్టణ ప్రగతిలో రూ.70 లక్షలు, కలెక్టర్ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేశారు. మొత్తం రూ.1.45 కోట్లతో నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయి. గ్రంథాలయం జీ ప్లస్ వన్ పద్ధతిలో రెండు పెద్ద హాళ్లు, విశాలమైన గదులు, గ్రంథాలయ అధికారి గది, పుస్తకాల గది, రీడింగ్ రూం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అన్ని వసతులతో నిర్మాణం చేపట్టారు. నూతన గ్రంథాలయంలో పాఠకులకు అనుకూలంగా పార్టెషన్ చేయనున్నారు. కేవలం ఫర్నిచర్ పనులు మాత్రమే మిలిగి ఉన్నాయి. వాటి పనులు పూర్తయితే గగ్రంథాలయాన్ని ప్రారంభించనున్నారు.

ఆనందంగా ఉంది



వేములవాడలో అన్ని హంగులతో గ్రంథాలయం నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించా. దాంతో గ్రంథాలయం పనులు ప్రారంభమై చివరిదశకు చేరుకోవడం ఆనందంగా ఉంది.

– సోమినేని బాలు. జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు

త్వరలోనే పనులు పూర్తి



పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిపోయిన పనులు కేవలం రెండు మూడురోజుల్లో పూర్తవుతాయి. పార్టెషన్ పనులను అధికారులు చేస్తారు.

– పంచాయతీరాజ్ ఏఈ పవన కుమారి, వేములవాడ

ఫుడ్ పాయిజన్ కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్

సిరిసిల్లటౌన్: సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ కారకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం శివారులోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఈనెల 12న భువనగిరి జిల్లాకు చెందిన గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తోనే ప్రశాంత్ అనే విద్యార్థి మృతిచెందడంతోపాటు మరో 24 మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మౌలిక వసతులపై శ్రద్ధ పెట్టాలని కోరారు. మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, హర్షిత్, నరేశ్, వసీం, అక్రమ్, సుదీప్, వంశీ తదితరులున్నారు.

'బీఆర్‌ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: బీఆర్‌ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా రెండోసారి బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎంపీ బండి సంజయ్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. సమావేశంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ, నాయకులు కోడె రమేశ్, శ్రీనివాస్, మురళీమోహన్ గౌడ్, నాగరాజు గౌడ్, వాజిద్‌హుస్సేన్, అన్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు నేవూరి వెంకట్‌రెడ్డిని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ అనుచరులు కూడా ఇంకా పార్టీలో ఉండి మోసపోతున్నారన్నారు.ఆ పార్టీలో స్వేచ్ఛలేకనే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డితో కలిసి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి, ఎద్ల రాజుకుమార్, ద్యాగం లక్ష్మీనారాయణ, గూడ విజయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన మిర్యాల్కర్ సాయికృష్ణ అనే యువకుడు గిద్దె చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో పార్టీపరంగా అండగా ఉంటామన్నారు. నాయకులు పందిర్ల పర్శరాములు గౌడ్, ఎద్ల సందీప్, సల్మాన్, రామచంద్ర, తదితరులున్నారు.

వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలి



గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

బోయినపల్లి: గ్రామాల్లో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసేవారు విధిగా గ్రామపంచాయతీ లైసెన్సులు తీసుకోవాలని ఎంపీడీవో బీమా జయశీల పేర్కొన్నారు. మండలంలోని బోయినపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్సులు తీసుకోని వ్యాపార సంస్థలపై చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు ఆస్తిపన్ను, ఇంటి పన్నులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజసులోచన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన వంశీ చందుర్తి నుంచి వేములవాడకు వెళ్తున్నాడు. మర్రిపల్లి వద్ద బైక్ అదుపు తప్పి పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

మల్లారం గ్రామ శివారులో మరో వ్యక్తికి..

కోనరావుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని మరిమడ్లకు చెందిన కొమ్ము రాజేశం వేములవాడలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా మల్లారం గ్రామ శివారులో గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశంకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో వేములవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై కేసు

రుద్రంగి: ఫారెస్ట్ అధికారిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ, వాచర్ రాజు విధుల్లో భాగంగా మానాల పరిసర ప్రాంతంలోని అడ్డబోర్ తండా ఏరియా అడవిలో గస్తీ తిరుగుతున్నారు. అడ్డబోర్ తండాకు చెందిన లావుడియా సంతోష్ వారిని అడ్డగించి అసభ్య పదజాలంతో దూషిస్తూ వారిపై దాడిచేసి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ ఎంపీటీసీపై

గంభీరావుపేట: గంభీరావుపేట మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం నగరం గ్రామానికి చెందిన కామునిరాములుకు కమలాకర్ రెడ్డి తన భూమిని అమ్ముతానని అడ్వాన్స్‌గా రూ.2లక్షలు తీసుకున్నాడు. ఆ భూమి కమలాకర్ రెడ్డిది కాదని, చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరగా బెదిరిస్తున్నాడని రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కమలాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్లపై..

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రం శివారులో పేకాటాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. వారి నుంచి రూ.4,360 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

అన్నదానం

వేములవాడ: మై వేములవాడ ట్రస్ట్ ద్వారా గురువారం 150 మందికి సభ్యులు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, ప్రతాప నటరాజు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్, పసూల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.